

## రేపు ఇస్కాన్ సైబరాబాద్ ఆలయం శంకుస్థాపన

### హాజరుకానున్న మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/సోమాజిగూడ :** మానవాళిలో శాంతి, ఆధ్యాత్మిక చింతన పెరగాలని, ఒకరి పట్ల ఒకరు ప్రేమ, దయ చూపాలని ఇస్కాన్ ఆకాంక్షిస్తున్నదని ఇస్కాన్ సైబరాబాద్ ఆలయ అధ్యక్షులు శ్రీరామ దాస పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఇస్కాన్ ఆలయ నిర్మాణార్థం మంజూరైన స్థలంలో ఈ నెల 8న హైదరాబాద్, నల్లగండ్ల, గోపన్‌పల్లి రంగనాథ స్వామి ఆలయం పక్కన ఇస్కాన్ సైబరాబాద్ ఆలయ భూమి పూజ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఎంఎల్‌ఎ అరికెపూడి గాంధీ, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్, ఇస్కాన్ ప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ ఆలయం సమాజం మొత్తానికి మేలు చేకూర్చే వేద సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చెందనున్నదన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరికి ఉన్నతమైన జీవిత ల్యోం, ఆధ్యాత్మిక ఆనందం కలిగించే పవిత్ర స్థలంగా ఆలయం నిలుస్తుందన్నారు. యువతకు విలువల ఆధారిత విద్య, నైపుణ్య అభివృద్ధి కోర్సులు, గోశాలలో గోవుల సంరక్షణ, ఆధ్యాత్మిక జ్ఞాన ప్రసారం, కుటుంబాలకు వేద జీవన విధానంలో మార్గదర్శనం అందిస్తామని వివరించారు. ఈ ఆలయంలో శ్రీ శ్రీ రాధా కృష్ణ, అష్టసఖి మందిరాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఇస్కాన్ ఆలయ ప్రతినిధులు సిద్ధ బలరాందాసు, వెంకట దాసు, కృష్ణ స్మరందాసు, గోపరాజు శ్రీనివాస్, అరవింద్, సిద్దేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌పిఎఫ్ సేవలకు గౌరవంగా 26 మందికి ప్రశంసా పత్రాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** విధుల్లో అంకితభావం, క్రమశిక్షణతో పనిచేస్తూ విశిష్ట సేవలు అందించిన దక్షిణ మధ్య రైల్వే రైల్వే రక్షణ దళం (ఆర్‌పిఎఫ్) అధికారులు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. హైదరాబాద్ మౌలాలిలోని ఆర్‌పిఎఫ్ శిక్షణ కేంద్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఐజి, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్ డైరెక్టర్ జనరల్ ఇన్‌సిగ్నియా, ప్రశంసా పత్రాలను అందజేశారు. మొత్తం 26 మంది అధికారులు, సిబ్బంది ఈ పురస్కారాలను అందుకున్నారు. 2024 గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ప్రతిభ కనబరిచిన 10 మంది, 2025 గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొన్న 13 మంది ఆర్‌పిఎఫ్ సిబ్బంది, అలాగే 2025 మహా కుంభమేళా విధుల్లో ఉత్తమ సేవలు అందించిన ఇద్దరు అధికారులు ఈ గౌరవాన్ని పొందారు.అదేవిధంగా హైదరాబాద్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ దేవశ్మితా సి. బెనర్జీ ప్రతిష్టాత్మకమైన ప్రధానమంత్రి సిల్వర్ కప్ కేస్ స్టడీ గెలుచుకున్నందుకు ఈ అవార్డు అందుకున్నారు. ఇటీవల దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో నిర్వహించిన 26వ ఆల్ ఇండియా పోలీస్ బ్యాండ పోటీని విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన ఆరుగురు ఆర్‌పీఎఫ్ అధికారులకు కూడా డిజి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించినందుకు అరోమా సింగ్ ఠాకూర్‌కు కూడా డీజీ ప్రశంసా పత్రం లభించింది.ఈ సందర్భంగా అరోమా సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ రైల్వే ప్రయాణికులు మరియు రైల్వే ఆస్తుల భద్రత కోసం ఆర్‌పీఎఫ్ సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని ప్రశంసించారు. క్రమశిక్షణ, టీమ్ వర్క్ మరియు విధి పట్ల నిబద్ధతే ఆర్‌పీఎఫ్ బలగం బలమని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ఆర్‌పీఎఫ్‌కు చెందిన పలువురు సీనియర్ అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. శిక్షణ పొందుతున్న 204 మంది ట్రైనీ సబ్ ఇన్‌స్పెక్టర్ కేడెట్లు పరేడ్ సమయంలో ఈ అవార్డు కార్యక్రమాన్ని వీక్షించారు.

## కారుణ్య నియామకాలకు రెండేళ్ల క్యాజువల్ సర్వీస్ నిబంధన ఆర్‌టిసి అవివేకం

### తీవ్రంగా ఖండించిన ఆర్‌టిసి నేషనల్ మజ్దూర్ యూనియన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కారుణ్య నియామకం కింద నియమించబడిన సిబ్బంది పిల్లల చట్టబద్ధమైన వాదనలను విస్మరిస్తూ, 2 సంవత్సరాల క్యాజువల్ సర్వీస్ పూర్తి చేసిన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలనే టిజిఎస్ ఆర్‌టిసి యాజమాన్యం యొక్క అవివేక నిర్ణయాన్ని ఆర్‌టిసి నేషనల్ మజ్దూర్ యూనియన్ తీవ్రంగా ఖండిస్తోంది. కార్పొరేషన్ 1000 మంది డ్రైవర్లు, 743మంది శ్రామిక్‌లను రెగ్యులర్ టైమ్ స్కేల్‌లో నియమించాలని యోచిస్తున్నందున, కారుణ్య నియామకం కింద నియమించబడిన వారికి, వారి న్యాయమైన ప్రయోజనాలను తిరస్కరించడం దారుణమన్నారు. ఈ ఉద్యోగులు కార్పొరేషన్‌కు గత మూడేళ్లుగా విధేయతతో సేవ చేస్తున్నారు, కానీ ఇప్పుడు ఆలస్యంగా క్రమబద్ధీకరణ కారణంగా ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదేవిధంగా భవిష్యత్‌లో నియామకం కాబడే ఉద్యోగుల పిల్లలకు ఇది తీరని నష్టమనీ, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్న న్యాయ సూత్రాలకు వ్యతిరేకంగా ఆర్‌టిసి యాజమాన్యం ప్రభుత్వాన్ని తప్పు దోవ పట్టిస్తోందన్నారు. యాజమాన్యం ఈ ఉద్యోగులను నియామకం తేదీ నుండి రెగ్యులర్ టైమ్ స్కేల్‌లో క్రమబద్ధీకరించాలని, వారికి సరైన ప్రయోజనాలు అందేలా చూసుకోవాలని యూనియన్ డిమాండ్ చేసింది. యాజమాన్యం వారి నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని, ఈ అంకితభావంతో ఉన్న ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నట్లు ఆర్‌టిసి నేషనల్ మజ్దూర్ యూనియన్ ప్రెసిడెంట్ పి.కమల్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# భూమి స్వాధీనం పిటిషన్ తిరస్కరణ

### బిల్లులు చెల్లించకపోతే కోర్టుకు రండి
### ఇందిరమ్మ ఇళ్లపై ప్రభుత్వానికి నోటీసు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైకోర్టులో శుక్రవారం వేర్వేరు కేసులపై విచారణ జరిగింది. విద్యుత్తు సబ్‌స్టేషన్ కోసం ఉచితంగా ఇచ్చిన భూమిని తిరిగి స్వాధీనం చేయాలన్న పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. మిషన్ భగీరథ పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడంపై ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ సుల్తానియాపై ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోవైపు ములుగు జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలకు చెందిన పిటిషన్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం ఉచితంగా ఇచ్చిన భూమిని తిరిగి స్వాధీనం చేయాలని కోరుతూ శ్రీ అభిషేక్ స్టీల్స్ అండ్ పవర్ లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం కండ్లకోయలోని ఫ్యాక్టరీ స్థలంలో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్‌ను తొలగించి భూమిని అప్పగించేలా టీఎస్ఎస్పీడీసీఎల్‌కు ఆదేశాలు ఇవ్వాలని కంపెనీ కోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక విచారించారు. గుండ్ల పోచంపల్లిలో ప్రత్యేక ఫీడర్ ద్వారా విద్యుత్తు సరఫరా చేస్తామని అప్పటి ఏపీఎస్ఈబీ హామీ ఇచ్చిన నేపథ్యంలో కంపెనీకి చెందిన నాలుగు ఎకరాల భూమిలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. అయితే ఆ హామీ అమలు కాలేదన్నారు. అనంతరం కంపెనీ రుణాలు చెల్లించలేకపోవడంతో ఫ్యాక్టరీ మూతపడిందని, ఆస్తులను బ్యాంకులు వేలం వేసినట్లు వివరించారు. గతంలో ఇచ్చిన సమ్మతిని ఉపసంహరించుకున్నామని, భూమిని తిరిగి స్వాధీనం చేయడంతో పాటు పరిహారం చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి.. భూమి హక్కులు లేదా పరిహారానికి సంబంధించిన వివాదాన్ని సివిల్ కోర్టులో తేల్చుకోవాలన్నారు. పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. విద్యుత్తు బకాయిలు, సర్‌చార్జీల రూపంలో రూ.1.28 కోట్లు చెల్లించకపోతే శ్రీనగర్ కాలనీలోని ఫ్లాట్‌కు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని టీఎస్ఎస్పీడీసీఎల్ ఇచ్చిన నోటీసును సవాలు చేస్తూ కంపెనీ దాఖలు చేసిన మరో పిటిషన్‌ను కూడా న్యాయమూర్తి కొట్టివేశారు. కొత్త విద్యుత్ కనెక్షన్ తీసుకున్నామని చెప్పి పాత బకాయిలు చెల్లించమంటే కుదరదని తీర్పులో పేర్కొన్నారు.



**ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిపై ఆగ్రహం**

మరో కేసులో శ్రీశైలం ప్రాజెక్టు నుంచి చేవెళ్ల, వికారాబాద్, పరిగి, తాండూరు, మహేశ్వరం నియోజకవర్గాలకు మిషన్ భగీరథ కింద తాగునీటి సరఫరా కోసం ఎన్‌సీసీ సంస్థ చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రూ.180.17 కోట్ల బిల్లుల్లో ఆమోదించిన మొత్తాన్ని చెల్లించాలని గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకపోవడంతో సంస్థ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ పి. మాధవీదేవి విచారణ చేపట్టారు. బిల్లులను ఆరు శాతం వడ్డీతో చెల్లించాలని ఆదేశించినప్పటికీ అమలు చేయలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ సుల్తానియా పిటిషన్ దాఖలు చేశామని ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. దీనిపై న్యాయమూర్తి.. ఈనెల 13లోగా గత ఉత్తర్వులను అమలు చేసి నివేదిక సమర్పించాలని, లేదంటే సందీప్ సుల్తానియా వ్యక్తిగతంగా కోర్టుకు రావాల్సిందేనని తేల్చి చెప్పారు.

**బిల్లులు చెల్లించకపోతే కోర్టుకు రండి**

చేప పిల్లలను సరఫరా చేసిన వారికి బిల్లులు చెల్లించాలన్న ఆదేశాలను అమలు చేయకపోవడంపై దాఖలైన మరో కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను కూడా న్యాయమూర్తి విచారించారు. 2023–24 ఏడాదికి చెందిన చేప పిల్లలు సరఫరా చేసిన వారికి బిల్లులు చెల్లించాలన్న గత ఆదేశాల్ని అధికారులు కావాలని అమలు చేయడం లేదని పిటిషనర్ లాయర్ చెప్పారు. గవర్నమెంట్ ఎంప్లాయిస్ జీతాల కోసం ఆ నిధుల్ని వినియోగించామని ప్రభుత్వ ప్లీడర్ చెప్పడంపై న్యాయమూర్తి అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈనెల 10లోగా బిల్లులు చెల్లించకపోతే సందీప్ సుల్తానియా వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించారు.

**ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అక్రమాలు**

ములుగు జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. వెంకటాపురానికి చెందిన వితంతువు తిప్పల సాయిభవాని హైకోర్టుకు లేఖ రాస్తూ ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లను కేటాయించేందుకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ముడుపులు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ లేఖను ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించిన జస్టిస్ పి. శ్యాం కోశీ, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావులతో కూడిన ధర్మాసనం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గృహ నిర్మాణ శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా కలెక్టర్‌తో పాటు సీబీఐకి నోటీసులు జారీ చేస్తూ విచారణను ఈనెల 30కి వాయిదా వేసింది.

### పునరుద్ధరించబడిన శాసనమండలి భవనం

## 8న ప్రారంభించనున్న సిఎం రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో పునరుద్ధరించబడిన శాసనమండలి భవనాన్ని ఈ నెల 8న ఉదయం 9:30 గంటలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన జరగనున్న కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొననున్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ఉపాధ్యక్షుడు డాక్టర్ బండా ప్రకాశ్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, శాసనమండలి ప్రతిపక్ష నాయకులు సిరికొండ మధుసూదనాచారి, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, ఎంఎల్‌సిలు ఎ.వి.ఎన్.రెడ్డి, ఎస్.వాణీ దేవి, మిర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, బొగ్గారపు దయానంద్, మిర్జా రహమత్ బేగ్ తదితరులు పాల్గొననున్నారు. నాంపల్లి ఎంఎల్‌ఎ మహమ్మద్ మజీద్ హుస్సేన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు, రోడ్లు,భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ తదితరులు కూడా కార్యక్రమానికి హాజరుకానున్నారు.

**పునరుద్ధరించబడిన శాసనమండలి భవనంలోనే సమావేశాలు**

పునరుద్ధరించబడిన శాసనమండలి భవనం ప్రారంభం అనంతరం, ప్రస్తుతం కొనసాగుతున్న శాసనమండలి చాంబర్లు, అనుబంధ కార్యాలయాలను ఈ నెల 8వ తేదీ నుండి శాసనసభ ప్రాంగణంలో ఉన్న కొత్త మండలి భవనానికి మార్చనున్నారు. భవిష్యత్తులో జరిగే అన్ని శాసనమండలి సమావేశాలు, సాధారణ పరిపాలనా కార్యకలాపాలు ఈ కొత్త కౌన్సిల్ హాలులోనే నిర్వహించనున్నారు. ఈ కొత్త శాసనమండలి భవనం ఆధునిక సదుపాయాలతో పునరుద్ధరించారు. దీనివల్ల శాసనమండలి సమావేశాలు మరింత సౌకర్యవంతంగా నిర్వహించేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని తెలంగాణ లెజిస్లేచర్ కార్యాలయం తెలియజేసింది. ఈ మేరకు తెలంగాణ లెజిస్లేచర్ (శాసనమండలి) కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు.



## మహిళా శక్తితోనే 'వికసిత భారత్' సాధ్యం: బన్సూరీ స్వరాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా శక్తి దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ఇప్పుడు 'మహిళా సాధికారత' దశను దాటి మహిళా నేతృత్వంలోని అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని బిజెపి ఎంపి బన్సూరీ స్వరాజ్ అన్నారు. హైదరాబాద్ సోమాజీగూడలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బన్సూరీ స్వరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బన్సూరీ స్వరాజ్ మాట్లాడుతూ మహిళల గౌరవం, అవకాశాలు, ఆర్థిక సాధికారత అనే మూడు స్తంభాలపై కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి మాట్లాడుతూ మహిళలు బలంగా నిలబడితేనే కుటుంబం, సమాజం, దేశం అభివృద్ధి చెందుతాయని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల భద్రతలో విఫలమైందని విమర్శించారు. మహిళలకు ఇచ్చిన రూ. 2500 ఆర్థిక సాయం, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు వంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలపై జరిగే అన్యాయాలపై బిజెపి పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, మహబూబ్ నగర్ ఎంపి డి.కె. అరుణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్, ఉపాధ్యక్షురాలు జయశ్రీ, సీనియర్ నాయకురాలు బంగారు శృతి తదితరులు పాల్గొన్నారు.

## సివిల్స్‌లో సింగరేణి ఉద్యోగి కుమార్తెకు ఆల్ ఇండియా 55 ర్యాంకు

### సివిల్స్‌లో మెరిసిన 20 మంది రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం లబ్ధిదారులు
### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రతిష్టాత్మక సివిల్ సర్వీసెస్ 2025 తుది ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటడంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా సివిల్ సర్వీసెస్‌లో తెలంగాణ యువత రాణించాలన్న లక్ష్యంతో సింగరేణి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద ఆర్థిక చేయూత అందుకున్న 20 మంది అభ్యర్థులు తుది ఫలితాల్లో విజేతలుగా నిలవడంపై ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ యువత ఆకాంక్షలను సాకారం చేసేందుకు ప్రజా ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తుందన్నారు. సింగరేణి ఉద్యోగి జి. రాజేశం కుమార్తె జి. సృజన జాతీయ స్థాయిలో 55వ ర్యాంకు సాధించడంపై సిఎండి డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది 202 మంది ప్రిలిమ్స్ లో ఉత్తీర్ణులు అయిన వారికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు చేతుల మీదుగా రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు. వీరిలో 51మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. వారికి మరో రూ.లక్ష చొప్పున ఆర్థిక చేయూత అందించగా, వారిలో శుక్రవారం ప్రకటించిన ఫలితాల్లో 20మంది విజేతలుగా నిలిచారు. గత ఏడాది ప్రారంభించిన పథకంలో తొలుత 140 మంది ప్రిలిమ్స్ లో ఉత్తీర్ణత సాధించిన వారికి సాయం అందించగా, వారిలో 20 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. వారిలో ఏడుగురు విజేతలుగా నిలిచారు.

**సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించిన అభ్యర్థులకు అభినందనలు: టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్**

సివిల్ సర్వీసెస్2025 తుది ఫలితాల్లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన అభ్యర్థులు విశేష ప్రతిభ కనబరిచి దేశవ్యాప్తంగా మంచి ర్యాంకులు సాధించడం ఆనందకరమని టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయం సాధించిన అభ్యర్థులందరికీ ఆయన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.
పట్టుదల, కృషి, లక్ష్యసాధన పట్ల నిబద్ధతతో తెలంగాణ యువత సివిల్ సర్వీసెస్ వంటి అత్యున్నత పరీక్షల్లో సత్తా చాటడం రాష్ట్రానికి గర్వకారణమని ఆయన అన్నారు. భవిష్యత్తులో దేశ పరిపాలనలో కీలక పాత్ర పోషిస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని విజేతలకు ఆకాంక్షించారు.



## ఆర్ అండ్ బి సెక్షన్, కార్యాలయాల్లో తనిఖీలు

### స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు రాష్ట్ర రోడ్లు, భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ అదనపు కార్యదర్శులతో కలిసి శుక్రవారం టి.ఆర్ అండ్ బి సెక్షన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పాత రికార్డులను సక్రమంగా సర్దుబాటు చేసి, అవసరమైన చర్యలు తీసుకొని, క్లోజ్ చేయాల్సిన ఫైళ్లను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. అనంతరం రెడ్ హిల్స్‌లో ఉన్న ఆర్ అండ్ బి శాఖ భవనంలో సెంట్రల్ బిల్డింగ్ డివిజన్‌తో పాటు అక్కడ ఉన్న ఇతర కార్యాలయాలను కూడా సందర్శించారు. అధికారులు, సిబ్బంది కలిసి కార్యాలయ ప్రాంగణం, రికార్డు గదులతో పాటు అందులో ఉన్న ఫైళ్లను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టి, ఈనెల 15 వరకు పూర్తి చేయాలన్నారు. ఎస్టాబ్లిష్‌మెంట్, విజిలెన్స్, డిసిప్లినరీ కేసులు, క్వాలిటీ కంట్రోల్ రికవరీలు, కోర్టు కేసులు వంటి పాత ఫైళ్లను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలనీ, కార్యాలయ నిబంధనల ప్రకారం పాత రికార్డులను తొలగించాలన్నారు. ముఖ్యంగా 2014 కంటే ముందు ఉన్న ఫైళ్లను అవసరమైతే స్కాన్ చేసిన డిజిటల్ రికార్డుల నుంచి ప్రింట్లు తీసుకుని ఇండెక్సింగ్ చేయాలనీ వికాస్ రాజ్ సూచించారు.

## సిఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

### నల్లచెరువును సందర్శించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్, జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కూకట్‌పల్లిలోని నల్లచెరువు అభివృద్ధి పనులను, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను సిఎంసి కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్‌తో కలిసి హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 9వ తేదీ సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ చెరువును అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఇతర శాఖల అధికారులతో కలిసి కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమం సజావుగా సాగేలా అధికారులు పలు అంశాలపై చర్చించారు. సభ ఎక్కడ నిర్వహించాలి, వేదిక నిర్మాణంపై దిశానిర్దేశం చేశారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల కోసం కేటాయించాల్సిన స్టాళ్ల స్థలాలను పరిశీలించారు. సభకు వచ్చే ప్రజల కోసం సీటింగ్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై ట్రాఫిక్ డిసిపి శేషాద్రి రెడ్డితో కలిసి చర్చించారు. భారీ సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున ఎవరికీ ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



**30 ఎకరాల్లో సుందరీకరణ**

ఒకప్పుడు ఆక్రమణల చెరలో చిక్కుకుని, కేవలం 16 ఎకరాలకే పరిమితమవుతుందనుకున్న నల్లచెరువును, హైడ్రా చొరవతో 30 ఎకరాల వరకు విస్తరించి సుందరంగా తీర్చిదిద్దారు. ఈ మార్పుపై స్థానిక కాంగ్రెస్ నాయకుడు బండి రమేష్ హర్షం వ్యక్తం చేశారు. గతంలో అటువైపు వెళ్లాలంటే భయపడేవారని, ఇప్పుడు ఆహ్లాదకరంగా మారిందని కొనియాడారు. ఈ సందర్భంగా కమిషనర్ రంగనాథ్‌ను ఆయన శాలువాతో సన్మానించారు. ఈ పర్యటనలో ట్రాఫిక్ డిసిపి శేషాద్రి రెడ్డి, హైడ్రా డిసిపి శ్రీకాంత్, ఏడిసిపి సుదర్శన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సలహాదారుగా దొమ్మటి సాంబయ్యను నియమించాలి

### పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ డిమాండ్



**ప్రజాపక్షం/సోమాజిగూడ:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాదిగ జాతిపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న ఖాళీ అయిన ప్రభుత్వ సలహాదారు పోస్టును మాదిగ బిడ్డ దొమ్మటి సాంబయ్యకు ఇవ్వాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ గ్రహీత మందకృష్ణ డిమాండ్ చేశారు. ఏ ప్రభుత్వ హయాంలో మాదిగలకు జరగని అన్యాయం, నమ్మకద్రోహం రేవంత్ రెడ్డి హయాంలోనే జరిగిందని ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. మాదిగ జాతి బిడ్డలు తన వెంటే ఉండటంతోనే తాను ఈ స్థాయికి ఎదిగానని అనేక వేదికల మీద మాట్లాడిన రేవంత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల్లో, రాజ్యసభలో, శాసన మండలిలో ఒక్క మాదిగకు కూడా అవకాశం ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేశారని పేర్కొన్నారు. మాదిగ జాతి పట్ల కృతజ్ఞత మరిచి తన కులతత్వాన్ని ప్రదర్శించి తన రెడ్డి కులస్థుడైన వేం నరేందర్‌రెడ్డికి రాజ్యసభ సీటు దగ్గరుండి ఇప్పించారన్నారు. సిఐ ఉద్యోగం వదిలి రేవంత్‌రెడ్డినే నమ్ముకొని ఉన్న మాదిగ జాతి బిడ్డ దొమ్మటి సాంబయ్యకు మాత్రం అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి రెండేండ్ల మూడు నెలల పాలనలో మాదిగలకు న్యాయం చేసిందేమీ లేదని, నష్టమే ఎక్కువ చేశారని పేర్కొన్నారు. సమావేశంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా.గోవిందు నరేశ్, ఎంఎస్ఎఫ్ జాతి అధ్యక్షులు డా.చిప్పలపల్లి సోమశేఖర్, ఎంఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు ఇంజం వెంకటస్వామి, మాదిగల మహిళా సమాఖ్య నాయకురాలు జెపి లత, ఎంఎస్‌పి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు టివి నరసింహా మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## 25 మంది మహిళా అటవీ సిబ్బందికి ప్రతిభా పురస్కారాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ అటవీ శాఖ ఆధ్వర్యంలో దూలపల్లి అటవీ అకాడమీలో 'గ్రీన్ క్వీన్స్ (హరిత రాణులు)' పేరుతో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అటవీ దళాల ముఖ్య సంరక్షణాధికారిణి డాక్టర్ సి. సువర్ణ, అదనపు డిజి స్వాతిలక్రా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అటవీ అకాడమీ డైరెక్టర్ ప్రియాంక వర్గీస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సి.సువర్ణ మాట్లాడుతూ మహిళా దినోత్సవం కేవలం మహిళలకే పరిమితమైన కార్యక్రమం కాదని, పురుషులు కూడా ఇందులో భాగస్వాములై సమానత్వ భావనను బలపరచాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు, పురుషులు కలిసి తమ అభిప్రాయాలను పంచుకునే వేదికగా ఇలాంటి కార్యక్రమాలు అవగాహన పెంపొందించడంలో కీలకంగా ఉంటాయని తెలిపారు అటవీ శాఖలో బీట్ ఆఫీసర్లుగా పనిచేసే ఉద్యోగుల్లో ఉద్యోగాన్ని వదిలి వెళ్లిన వారిలో ఎక్కువ మంది పురుషులేనని, మహిళలు మాత్రం చాలా అరుదుగా ఉద్యోగాన్ని వదిలినట్లు తెలిపారు. ఇది మహిళలు సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. అటవీ శాఖలో పనిచేస్తున్న మహిళా ఫ్రంట్‌లైన్ సిబ్బంది అడవుల సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆమె చెప్పారు. అడవుల్లో నిరంతరం పనిచేస్తూ పొందే అనుభవం, నైపుణ్యాల అభివృద్ధి ద్వారా వారు తమ బాధ్యతలను మరింత సమర్థంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ధైర్యం, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ అటవీ సంపదను కాపాడటంలో మహిళలు ముందుండటం అభినందనీయమన్నారు. అదనపు డిజి స్వాతి లక్రా మాట్లాడుతూ యూనిఫామ్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళలను చూడటం గర్వంగా అనిపిస్తుందన్నారు. పోలీస్, వైద్య, అటవీ శాఖలతో పాటు వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మహిళలు ధైర్యంగా సమాజానికి సేవ చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. మహిళలు కేవలం భద్రతను కాపాడటమే కాకుండా సమాజ భవిష్యత్తును నిర్మించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అటవీ సంరక్షణలో ఉత్తమ పనితీరు కనబరిచిన 25మంది మహిళా అటవీ సిబ్బందికి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అటవీ వన్య సంరక్షణాధికారి వినయ్ కుమార్, పిసిసిఎఫ్ సీనియర్ అధికారి రత్నాకర్ జౌహరీ, అటవీ అభివృద్ధి సంస్థ ఎండి సునీత ఎం.భగవత్, సిసిఎఫ్ క్షితిజ, సీనియర్ అటవీ అధికారులు అర్పణ, శ్రీలక్ష్మి, ప్రవీణ, అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ రేఖ భాను పాల్గొన్నారు.



## ఇంటి పన్నులు వసూలుకు చర్యలు

ఎంపిడిఒ లక్ష్మీ అనురాధ



**ప్రజాపక్షం/కొందుర్గు:** ఇండ్ల కొలతలు తీసి విధిగా ఇంటి పన్నులు వసూలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కొందుర్గు ఎంపి డిఒ లక్ష్మీ అనురాధ సూచించారు. శుక్రవారం కొందుర్గు కేంద్రంలోని ఎంపిడిఒ సమావేశ మందిరంలో ఎంపిడిఒ 99రోజుల ప్రగతి ప్రణాళికపై అధికారులకు దిశా నిర్ధేశం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆజా మాలి, ఎంఇఓ గాయత్రి, ఎంపిఓ విజయ్‌కుమార్ పాల్, సిడిపిఓ ఉదయ, హౌజింగ్ ఏఈ అన్వేష్, సూపరిండెంట్ గణపతితోపాటు పంచాయతీ కార్య దర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం



**ప్రజాపక్షం/ఫరూక్‌నగర్:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధియే లక్ష్యంగా పనులు చేస్తున్నామని ఎలికట్ట గ్రామ సర్పంచ్ బుడ్డ నవకిరణి నరసింహ ముదిరాజ్ వివరించారు. శుక్రవారం మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో సర్పంచ్ బుడ్డ నవకిరణి నరసింహా ఆధ్వర్యంలో 8వ వార్డులో రోడ్డు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కావలి శ్రీశైలం ముదిరాజ్, పంచాయతీ కార్యదర్శి తేజస్విని, ఉప సర్పంచ్ అభి నవ్, నాయకులు ఆర్ల యాదయ్య, చాకలి చంద్రయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ లక్ష్యాల అమలు : ఎంపిడిఒ



**ప్రజాపక్షం/యాచారం :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రభుత్వ లక్ష్యాలు అమలు చేయాలని యాచారం ఎంపి డిఒ రాధరాణి కోరారు. శుక్రవారం యాచారం మండల పరిషత్ కార్యాల యంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రాధరాణి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం 99 రోజుల యాక్షన్ ప్లాన్ విధించిందని తెలిపారు. కార్యక్రమంలో యాచారం తహసీల్దారు అయ్యప్ప, యాచారం సిఐ నంది శ్వర్‌రెడ్డి, వ్యవసాయధికారి అర్ రవినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషి




**ప్రజాపక్షం/షాబాద్:** ప్రగతి ప్రణాళికతో గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎంపిడిఒ అపర్ణ అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ అపర్ణ మాట్లాడు తూ సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కా రానికి ప్రణాళిక సిద్ధ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిఒ నాసరయ్య, ఎఇ ఆర్‌డబ్యుస్ చంద్రమోహన్, వైద్య అధికారి తబుసం, ఎపిఒ వీరాసింగ్, ఎపియం నర్సింలు, వ్యవసాయ అధికారి విజయచంద్ర, సర్పంచ్‌లు పాల మాకుల మల్లయ్య, గుండాల అశోక్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పాఠశాల, వైద్యశాలకు భూమి కేటాయించాలని కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** హస్తినాపురం డివిజన్ జెడ్‌పి రోడ్డుకు ప్రభుత్వ పాఠశాల, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కోసం ప్రభుత్వ భూమి కేటాయించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటెల రాజేందర్ రాసిన లేఖను శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి వారి కార్యాలయంలో హస్తినాపురం డివి జన్ బిజెపి నాయకులు అందజేశారు. పార్టీ డివిజన్ అధ్యక్షులు ఎరుకల మల్లేష్‌గౌడ్, మాధవరెడ్డి, రాజు గౌడ్, వెంకటేష్ గౌడ్, ప్రకాష్, కంది శ్రీని వాస్‌రెడ్డి, రవి గుప్తా, లక్ష్మి కాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయని ప్రభుత్వం

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని రాష్ట్ర రైతు సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంత మాధవరెడ్డి అన్నారు. కందుకూరు మండలం పులిమామిడి, బాచుపల్లి, జైతారం గ్రామాలలో గురు శుక్రవారంలో రైతు సభ్యత్వ నమోదు కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని మాధవరెడ్డి డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రాబోయే రోజుల్లో ప్రజలు,రైతులను సంఘటితం చేసి సంఘటిత ఉద్యమా లను నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు నాయకులు విజయ్,రామ్చందర్,రాంరెడ్డి,నరేందర్,ముజీబ్.కృష,రమేష్.పాల్గొన్నారు.

# విద్యార్థుల ఫీజులపై నిర్లక్ష్యం వద్దు

వెంటనే బకాయిలు చెల్లించాలి

కలెక్టరేట్ ముట్టడిలో ఎంపి ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని 16 లక్షల మంది బిసి, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థుల చదువులకు ఫీజు లు, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించకపోవడం అన్యాయ మని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్య క్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య అన్నారు. కాంట్రాక్టర్ల బిల్లు లకు వేల కోట్లు ఇచ్చేందుకు శ్రద్ధ పెడుతున్న ప్రభుత్వం పేద విద్యార్థుల ఫీజుల పట్ల నిర్లక్ష్యం వహించడం సరికా దన్నారు. ఫీజుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వందలాది మంది విద్యార్థులు హైదరా బాద్ జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ కార్యక్రమా నికి సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ కుమార్ అధ్యక్షత వహించగా, సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ల సతీశ్ సమన్వయకర్తగా వ్యవహరించా రు. ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై ఎనిమిది నెలలు గడు స్తున్నా రూ.8వేల కోట్ల ఫీజులకు కనీసం వెయ్యి కోట్లు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. కోర్సు పూర్తిచేసి ఐదా రేళ్లు గడిచినా విద్యార్థులు డబ్బులు కట్టలేని పరిస్థితిలో సర్టిఫికెట్లు కూడా తీసుకోవడం లేదన్నారు. దీంతో ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీంతో పేద పిల్లలు ఉన్నత విద్య చదువుతున్నారని, అంతేగాక సమాజంలో గుణాత్మక మార్పు వచ్చిందన్నారు. ఇలాంటి మహత్తర మైన స్కీంను అగ్రకుల ప్రభుత్వ పెద్దలు నీరుగార్చే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఫీజులివ్వకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకొంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. సమావేశంలో బిసి ఐక్యవే దిక అధ్యక్షులు అనంతయ్య, నేతలు శివకుమార్ యాదవ్, అంజి గౌడ్, నిఖిల్ పటేల్, చరణ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యమకారులకు ఉద్యోగాల కల్పనకు కృషి

ధూం ధాం సభలో ఎంపి ఆర్.కృష్ణయ్య

**సోమాజిగూడ :** తెలంగాణ ఉద్యమకారులకు ఉద్యో గాలు వచ్చేవరకు కృషిచేస్తానని, ఈ విషయమై త్వరలో సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య తెలి పారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో "ధూమ్ ధాం" సాంస్కృతిక కార్యక్రమం బిసి కళామండలి జాతీయ అధ్యక్షులు రామలింగం, అనుమొలు వెంకటేశ్, కిరణ్ కుమార్,నీలం వెంకటేశ్ అధ్యక్షతన నిర్వహించగా, ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సమాజం మార్పునకు రాజకీయ చర్చలు, తీర్మానాలు సరిపోవని, ప్రజల్లో అవగాహన పెరగాలని, ఆ అవగా హనను వేగంగా వ్యాప్తిచేసే శక్తి ఒక్క సాంస్కృతిక రంగా నికే ఉన్నదన్నారు. సామాజిక ఉద్యమాల్లో పాటలు, జాన పద కళారూపాలు ప్రజలను సంఘటితం చేశాయ న్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమ గీతాలు ప్రజల్లో విశేష ఉత్సాహాన్ని నింపాయన్నారు. బిసిల సమస్యలు, వారి హక్కుల కోసం జరుగుతున్న పోరాటాన్ని ప్రజలకు చేరవేయటంలో కళాకారులు ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో చైతన్యం పెంచడంలో కళాకారుల పాత్ర గొప్పదని కొనియాడారు. సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం మాట్లా డుతూ సామాజిక న్యాయం కోసం సాగుతున్న ఉద్య మాన్ని ప్రతిబింబించే గీతాలను రూపొందించాలని కళా కారులకు సూచించారు. కార్యక్రమంలోబిసి ఉద్యమ నేతలు నీలం వెంకటేశ్, అనంతయ్య, పగిళ్ల సతీశ్, రాందేవ్ మోదీ, కళాకారులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆధునిక హంగులతో థీమ్ పార్కు

ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** మహిళా థీమ్ పార్కును ఆధునిక హంగులతో నిర్మాణం చేయడం జరిగిందని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని సచివాలయ నగర్ కాలనీలో నూతనంగా చేపట్టిన ఉమెన్స్ థీమ్ పార్కు పనులు చివరి దశకు చేరుకోవడంతో స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భం గా ఎంఎల్‌ఎ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ థీమ్ పార్కులో అన్నిరకాలుగా వస తులు కల్పించడంతో పాటు ప్రత్యేక ఓపెన్ జిమ్‌లు, యోగా, మేడిటేషన్, కరాటే తదితర సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, అనిల్ చౌదరి, ముద్దగొని సతీష్ గౌడ్, జక్కిడి రఘువీర్‌రెడ్డి, నీలం రాజశేఖర్ గౌడ్, కొంగర మహేష్, పొగుల రాంబాబు, వర్ధని, వాణి, కైసర్ పాల్గొన్నారు.

# ప్రగతి ప్రణాళిక విజయవంతానికి కృషి

జలమండలి ఎండి అశోక్‌రెడ్డి పిలుపు

**ప్రజాపక్షం/సిటీబ్యూరో :** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జలమండలి ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశిం చిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను విజయ వంతంగా అమలు చేయాలని జలమండలి ఎండి అశోక్‌రెడ్డి కలిసి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరుతో శుక్రవారం ప్రారంభమైన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను విజయవంతంగా నిర్వ హించేందుకు సమగ్ర కార్యక్రమాన్ని రూపొందిం చిందని, ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి.. జలమండలి సంబంధించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రతి అధికారి శక్తివం చన లేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. జల మండలి ప్రధాన కార్యాయలంలోని గ్రౌండ్ ఫ్లోర్ లోని ఈడీపీ, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీస్ వద్ద ఫైల్ డిస్పోసల్‌ను పరిశీలించిన ఎండీ పేరుకుపోయిన పాత ఫైళ్లను తొలగించి కార్యాలయాన్ని పరిశ్రు భంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. అవస రమైన ఫైళ్లను భద్రపరచాలి సూచించారు. అవరం మేరకు డాక్యుమెంట్లను స్కాన్ చేసి బ్యాక్ చేసుకో వాలని అధికారులను జలమండలి ఎండి అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ టివి శ్రీధర్, పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ఫైనాన్స్ డైరెక్టర్ పద్మా వతి, ఓఅండ్ ఎం, ఫైనాన్స్, పీ అండ్ ఏ, ఐటీ, రెవిన్యూ, ట్రాన్స్మిషన్ సీజీఎంలు, జీఎంలు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వద్దు

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ డాక్టర్ టికె.శ్రీదేవి

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాల ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని శంకర్‌పల్లి మున్సిపాల్టీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రెటరీ (సిడిఎంఎ) డాక్టర్ టికే. శ్రీదేవి, మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ ఈ కార్యక్రమం మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ఉంటుందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ ప్రజ లందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విద్య, వైద్యం, సంక్షేమం, వ్యవసాయం, క్రీడలు, యువత, నైపుణ్యాలు వంటి అంశాలపై విడతల వారీగా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. మార్చి 6 నుంచి 15వ తేదీ వరకు పరిసరాల శుభ్రత, పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్ పరిష్కా రంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నామని తెలియజేశారు. రోడ్లపై చెత్త వేయరా దని, తడి చెత్త పొడి చెత్త వేరు చేయాలని, ప్లాస్టిక్‌ను నిర్మూలించాలని సూచించారు. పారిశుద్ధ్యం విషయంలో శంకర్‌పల్లి పట్టణం జాతీయ స్థాయిలో అవార్డు పొందాలని ప్రజలకు సందేశం ఇచ్చారు. కార్యక్రమం లో జాయింట్ డైరెక్టర్ కే. ఫల్గుణ్ కుమార్, వైస్ చైర్‌పర్సన్ జూలకంటి శ్వేత పాండురంగ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు దండు రాజేశ్వర్, అశోక్, ఉషాకిరణ్ విజయ్‌కుమార్, ఆనంద్ రావు, గణేష్, గిరిజ చంద్రశేఖర్, కమిషనర్ యోగేష్, మేనేజర్ అంజన్ కుమార్, డిఇ యాదయ్య, ఎఇ నరేష్‌తో పాటు మెప్మా ఆర్పీలు, పారిశుద్ధ్య, మున్సిపల్, రెవెన్యూ, ఇతర లైన్ డిపార్ట్మెంట్ల సిబ్బంది పాల్గొన్నారు.



## తృటిలో తప్పిన పెను ప్రమాదం..

వంటగ్యాస్ సిలిండర్‌లో చెలరేగిన మంటలు



**ప్రజాపక్షం/కొందుర్గు:** వంటగ్యాస్ సిలిండర్‌లో ఒక్కసారిగా మంటలు రావ డంతో విద్యార్థులు అంగన్‌వాడీ కేంద్రం నుండి బయటకు పరుగులు తీశారు. శుక్రవారం కొందుర్గు మండల కేంద్రం లోని అంగన్‌వాడి కేంద్రం..1లో ఈ సంఘటన చోటు చేసుకుంది. అంగన్ వాడి కేంద్రంలో ఉదయం సమయంలో విద్యార్థులకు భోజనం చేసేందుకు సిద్ధ మవుతున్న తరుణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గ్యాస్ సిలిండర్ నుండి మంటలు వస్తున్న విషయాన్ని గమనించిన అంగన్‌వాడీ ఉపాధ్యాయు రాలు అక్కడే ఉన్న 18మంది విద్యార్థులకు తరగతి గది నుండి బయటకు పంపించారు. దాంతో అక్కడే ఉన్న వంట సిబ్బంది ధైర్యం చేసి గ్యాస్ సిలిండ ర్‌పై తట్టు సంచి వేసి మంటలను ఆర్పివేశారు. అంగన్‌వాడీ భవనాలను విశాల ప్రదేశంలో నిర్మించి వంటకు ప్రత్యేకమైన కిచెన్ ఏర్పాటు చేయాలని, సంబం ధిత అధికారులు ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజల కోసమే ప్రగతి ప్రణాళిక

సిడిఎంఎ డైరెక్టర్ మమత



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజల అభ్యున్నతి కోసమే ప్రగతి ప్రణాళికల అని సిడిఎంఎ డైరెక్టర్ జి.మమత వివరించారు. శుక్రవారం షాద్‌నగర్ మున్సి పల్ సమావేశ మందిరంలో కౌన్సిలర్లకు కమిషనర్ సునితారెడ్డి ఆధ్వర్యం లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దిశా నిర్ధేశం చేశారు. కార్యక్రమంలో మున్సి పల్ చైర్మన్ బసవేశ్వర్, వైస్‌చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కౌన్సిలర్లు అగ్గనూరు విశాల విశ్వం, శ్రావణి, లక్ష్మి ప్రసన్న, బచ్చలి నరేష్, ఎస్పీ శివ, పినమోని గోపాల్, మురళీమోహన్, చాకలి పెంటయ్య, కళ్యాణ్‌కార్ దిలీప్, వాణి, శిరీష, రిజ్వానాభేగం, నందారం అశోక్, మరియం భేగం, జయలక్ష్మి, నాజియాభేగం, సంతోషి బాయి, ఆరిఫ్‌భేగం, తెలుగు వసంత, అనిత, శారద పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం /అబ్దుల్లాపూర్ మెట్:** చిన్న రావిరాల గ్రామపంచాయతీ పరి ధిలో గల గోలేటి గ్రామంలోని రామాలయం దగ్గర సీసీ రోడ్డు పనులను సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్,ఉపసర్పంచ్ శిరీష శంకర్‌రెడ్డి ప్రారంభిం చారు. కార్యక్రమంలోవార్డు సభ్యులు ఆకిటి రామకృష్ణారెడ్డి,నా రెడ్డి రిషిత సతీష్ రెడ్డి, రాపోలు మల్లేష్, బండారు సత్యనారాయణ,చెరుకు భాగ్యమ్మ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో మంచినీటికి ఇబ్బంది రాకుండా జాగ్రత్తలు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** వేసవిలో ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు రానివ్వకుండా అధికారులు తగి న జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పబ్లిక్ హెల్త్, ఆర్‌అండ్ బి, మిషన్ భగీరథ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మె ల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని అధికారులు ప్రణాళిక బద్ధంగా మంచినీటిపై దృష్టి కేంద్రీకరించాలని సూచించా రు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పరిస్థి తిని ప్రతిరోజు పర్యవేక్షించాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా మంచినీటి పైపులైన్ పనులు ఉంటే తక్షణమే మరమ్మత్తులు చేసి అందుబాటు లోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.మండలాల వారిగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ ఏర్పాటు చేసి ప్రణా ళిక బద్ధంగా అమలు చేయాలన్నారు. అమృత్ స్కీమ్‌లో భాగంగా చేపడుతున్న ట్యాంక్‌ల నిర్మా ణాలను త్వరగా పూర్తి చేయాలని కోరారు. పెండిం గ్‌లో ఉన్న పైపులైన్ కనెక్షన్లు ఇవ్వడంతోపాటు నల్లా కనెక్షన్లు ఇవ్వాలని, షాద్‌నగర్ పట్టణంలో పైపులైన్, కేబుల్ తవ్వకాలు అధికారుల సమ న్వయ అనుమతులతో జరగాలన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ లలిత, ఎగ్జిక్యూటివ్ ఇంజ నీర్ కవిత, ఆర్‌అండ్‌బి శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజ నీర్ రవీంద్ర, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సందీప్, అబ్దుల్ బారి, మండలాల మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, మున్సిపల్ డిఇ నరేష్, పబ్లిక్ హెల్త్ డిఇ సాజిద్, ఇలియాస్‌లు పాల్గొన్నారు.

# వేం నరేందర్‌రెడ్డిని కలిసిన జక్కిడి శివచరణ్‌రెడ్డి

**ప్రజాపక్షం/హయత నగర్ :** కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభ సభ్యుడిగా నామినేషన్ వేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డిని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివ చరణ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నరేం దర్ రెడ్డిని కలిసిన వారిలో శివ చరణ్‌రెడ్డితో పాటు యువజన కాంగ్రెస్ నాయకులు యారాల రామ్‌రెడ్డి, గూడూరు నిఖిల్‌రెడ్డి, గుర్రం శివచరణ్‌రెడ్డి ఆయన తో ఉన్నారు.






## ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉత్పత్తుల ప్రదర్శన

### సిఐఎ అధ్యక్షుడు డిసి రెడ్డి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి పారిశ్రామికవాడలోని సిఐఎ ఆడిటోరియంలో చర్లపల్లి పారిశ్రామికవేత్తల సంఘం ఆధ్వర్యంలో మార్చి 9వ తేదీ సోమవారం నుంచి 11వ తేదీ వరకు ఎంఎస్ఎంఇ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు చర్లపల్లి పారిశ్రామికవేత్తల సంఘం అధ్యక్షులు డి. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఎగ్జిబిషన్‌లో 115 స్టాళ్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పలు ప్రభుత్వరంగ సంస్థలతో పాటు చర్లపల్లి పారిశ్రామికవాడలోని ఎన్నో కంపెనీలు తమ పారిశ్రామిక ఉత్పత్తులను ప్రదర్శిస్తారని తెలిపారు. ఉత్పత్తులు విక్రయంతో పాటు మార్కెటింగ్, బ్యాంక్ రుణాలు వంటి అన్ని అంశాలపై అవగాహనకు ఎగ్జిబిషన్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బిఎల్ఆర్ హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వై.సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి పిఎస్ మోహన్, కమిటీ సభ్యులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య నివారణే లక్ష్యంగా ముందుకెళ్తాం

### అలియాబాద్ చైర్ పర్సన్ శిరీషా కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక చర్యలు చేపడుతామని చెత్త చెదారం లేకుండా మున్సిపాలిటీని అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతామని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో 99 రోజుల కార్యచరణ ప్రణాళిక అమలు పట్టణ పరిశుభ్రతలో భాగంగా చైర్ పర్సన్ శ్రమదానం చేసి అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అలియాబాద్‌ను అత్యంత సుందర మున్సిపాలిటిగా తీర్చిదిద్దుటకు ప్రణాళికలు చేపడుతామని చెప్పారు. ఎక్కడా కూడ చెత్త చెదారం కనిపించకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో అలియాబాద్‌ను రాష్ట్రంలోనే ప్రగతి బాటలో తీసుకెళ్లుటకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్, వైస్ చైర్‌పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్లు గాదె వెంకటేష్, గూదె వెంకటేష్, కైర గణేష్, ముద్దం సుధాకర్‌రెడ్డి, జశ్వంత్‌రెడ్డి, కోడూరి మౌనిక, సరసం వనజ, అప్పావత్ వెంకటేష్, ఎఇఇ సనా షాహీన్, ఇంచార్జ్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఇంచార్జ్ ఆర్ఐ వేణుగోపాల్, ఇంచార్జ్ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ విజయ్‌కుమార్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## జనఔషధి కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** దమ్మాయిగూడ డివిజన్ పరిధిలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిచేతుల మీదుగా ప్రధాన మంత్రి జనఔషధ కేంద్రాన్ని మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రణీశ్రీకాంత్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. ప్రజలకు తక్కువ ధరల్లో నాణ్యమైన మందులు అందించాలనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ జనఔషధి కేంద్రం సామాన్య ప్రజలకు ఎంతో ఉపచయోగకరంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా నిర్వహకుడు పిల్లి సాయిరామ్‌ను అభినందించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పత్రాలతో ప్లాటు ఆక్రమణకు యత్నం

### ఇద్దరు అరెస్టు..కోర్టుకు తరలింపు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** నకిలీ పత్రాలతో భూమిని ఆక్రమించడానికి ప్రయత్నించిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్‌లో పరిధిలో చోటు చేసుకుంది. సిఐ తెలిపిన వివరాల ప్రకారం కీసర పిఎస్ పరిధిలోని చీర్యాల గ్రామం సర్వే నంబర్ 71లో గల ప్లాటు నంబర్ 71కి సంబంధించిన సికింద్రాబాద్ లోతుకుంట నివాసియైన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి ఇక్బాల్‌చంద్ బాటియా(80) ప్లాటును కోనుగోలు చేశారు. ఇట్టి ప్లాటులో గత సంవత్సరం డిసెంబర్‌లో సింగిరెడ్డి సంజీవరెడ్డి అతని కుమారుడు అక్రమంగా ప్రవేశించి దుర్భాషలాడుతూ ప్రహరీని ధ్వంసం చేసి బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో కేసును నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. భూవివాదంలో నకిలీ పత్రాలు తయారు చేసి భూమిని ఆక్రమించడానికి ప్రయత్నించామని ఒప్పుకోవడంతో ఇద్దరు వ్యక్తులు సింగిరెడ్డి సంజీవరెడ్డి,అతని కుమారుడు సింగిరెడ్డి శశిధర్‌రెడ్డిలను కీసర పిఎస్ పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చడం జరిగిందని ఆయన తెలిపారు.

## క్రైస్తవ స్మృతివనం నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మాదారం గ్రామంలోని క్రైస్తవ స్మృతివనం నూతన కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులుగా జోసెఫ్ భూపతి, ఇ.మార్టిన్, పి సునీల్ కుమార్, శ్రీనివాస్, ఎస్‌డి పుల్లయ్యలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్రైస్తవ స్మృతి వనం నూతన సభ్యులకు సహకరించిన మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్,సేట్ క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ దీపక్ జాన్, మేడ్చల్ నియోజకవర్గం బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, పోచారం మున్సిపల్ మహిళ అధ్యక్షురాలు ఎర్ర మాధవిరాజు, నూతన క్రైస్తవ స్మృతి వనం కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. నూతన కమిటీ సమావేశంలో స్మశాన వాటికలో కరెంటు స్తంభాలు, బిటి రోడ్లు, స్నానాల గదులు ఏర్పాటు చేయుటకు తీర్మానం చేసుకున్నారని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన అధికారులు జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ వాణి, మేడ్చల్ డిఎండబ్ల్యుఓ కాంతమ్మ, ఎమ్మార్వో చంద్రశేఖర్, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మాణానికి సహకరిస్తా

### ఐటి శాఖ, ఇంచార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియాబాద్ రామాలయం వద్ద ఉన్న బ్రిడ్జ్ నిర్మాణానికి పూర్తి సహాయ సహకారాలను అందిస్తానని ఐటి శాఖ, ఇంచార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన 'ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99'లో భాగంగా జరిగిన మున్సిపల్ చైర్మన్‌ల సమావేశంలో అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి మంత్రి శ్రీధర్‌బాబును పూలబొకేతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి అలియాబాద్ బాబాగూడ మధ్యలో ఉన్న వాగు బ్రిడ్జ్ నిర్మాణం చేయడానికి నిధులు మంజూరు చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. ఇట్టి విషయమై మంత్రి సానుకూలం గా స్పందించి తప్పకుండా బ్రిడ్జ్ నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారని చైర్ పర్సన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్ రెడ్డి, గ్రంథాల య చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, అలియాబాద్ మాజీ సర్పంచ్ కమతం కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల మహమ్మారిని తరిమికొడుదాం..

### నార్కోటిక్ సిఐ ఎ.పూర్ణేశ్వర్





**ప్రజాపక్షం/నవాబుపేట:** మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు బాధ్యతతో కృషి చేయాలని నార్కోటిక్ సిఐ ఎ.పూర్ణేశ్వర్ కోరారు. ప్రభుత్వం ప్రత్యేకంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నవాబుపేట మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్ గాజులగూడెం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని బస్టాండు నుండి పాఠశాల విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నవంబర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణ లో సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగంతో యువత నిండు ప్రాణాలను కోల్పో యి భవిష్యత్తును కోల్పోతుందన్నారు. మాదకద్రవ్యాల మహమ్మారిని రాష్ట్ర సరిహద్దుల వరకు తరిమికొట్టి, తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ వల్ల కలిగే సామాజిక అనర్థాలపై ఆందోళన వ్యక్తం చేశా రు. మత్తు కోరల్లో చిక్కి ఎంతోమంది యువత భవిష్యత్తు నాశనమవుతోంది. ఎన్నో కుటుంబాలు చితికిపోతున్నాయి, తలిదండ్రుల ఆశలు అడియాశలవుతున్నాయి. ఇలాం టి అరాచక శక్తులను సమాజం నుంచి ఏరిపారేయాలని విద్యార్థులకు సూచించారు.

అక్రమ మద్యం నియంత్రణ, మాదక ద్రవ్యాల నిర్మూలనకు అంకితభావంతో పని చేస్తున్నారు అని గుర్తు చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నార్కోటిక్ సిఐ ఎ.పూర్ణేశ్వర్, నవాబుపేట ఎస్సై జి.పుండ్లిక్, వికారాబాద్ ఎఆర్ఐ శ్రీశైలం, మండల ఎమ్మార్వో జి. బుచ్చయ్య, డిప్యుటీ ఎమ్మార్వో నవీన్ కుమార్, ఎంపిడిఓ అనురాధ, గ్రామ సర్పంచ్ నర్సింహా రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి, నవనీతం, భానుప్రియ, ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ బృందం, గ్రామ ఉపసర్పంచ్‌లు వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు, నాయకులు, యువకులు, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## 2కె రన్‌లో ఎస్‌పి స్నేహమెహ్రా



**ప్రజాపక్షం/కొడంగల్:** 2కె రన్ లో పాల్గొన్న జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా, శుక్రవారం కొడంగల్ పట్టణ కేంద్రంలో తెలంగాణముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట వ్యాప్తంగా నిర్వహిస్తున్న, 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజు లు' కార్యక్రమంలోభాగంగా 5వ థీమ్ అయిన పిల్లల భద్రత డ్రగ్స్ కు అడ్డుకట్ట అంశంపై కొడంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2కె రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్‌పి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాల్సిన నేటి విద్యార్థులే రేపటి భారత పౌరులని, వారిని మాదకద్రవ్యాల మహమ్మారి నుండి కాపాడుకోవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. విద్యార్థిదశ నుంచే డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని యువత తమ శక్తిని క్రీడలు, విద్య, ఇతర నిర్మాణాత్మక కార్యక్రమాల వైపు మళ్లించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం తెలంగాణ ప్రభుతం ఎంతో కృషి చేస్తుందన్నారు. యువత తమ శక్తిని క్రీడలపై, విద్యపై ఇతర నిర్మాణాత్మక కార్యక్రమాలవైపు మళ్లించుకోవాలని సూచించారు. ఎక్కడైనా డ్రగ్స్ సరఫరా లేదా వినియోగం జరుగుతున్నట్లు సమాచారం ఉంటే భయపడకుండా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు కృష్ణమూర్తి, ఆములు నాయక్ , పరిగి డిఎస్‌పి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనలో భాగంగా పారిశుద్ధ్య పనులు

### గ్రామ సర్పంచ్ గంజాయి రేణుక రాములు

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** నవాబు పేట్ మండల పరిధిలోని ఆర్కతల గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రతి వార్డులో మోరీలు తీయించడం చెత్త తీసివేయడం, రోడ్ల పక్కన ఉన్న పిచ్చి మొక్కలు తీసివేయడం వంటి కార్యక్రమం గ్రామంలో పారిశుద్ధ పనులు శుభ్రపరచడం జరిగిందని గ్రామ సర్పంచ్ గంజాయి రేణుక రాములు పేర్కొన్నారు.

అదే విధంగా గ్రామములో ప్రతి వార్డు శుభ్రంగా ఉండడమే ధ్యేయంగా ప్రతిరోజు కొత్త కొత్త కార్యక్రమాలు చేపట్టి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించే విధంగా కృషి చేస్తానని గ్రామ సర్పంచ్ అన్నారు. గ్రామ ప్రజలకు మంచి నీటి సౌకర్యం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివ లీల, భాగయ్య, వార్డ్ మెంబర్లు, శ్రీశైలం, వెంకటయ్య, కావలి అంజయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వీడియో జర్నలిస్ట్ దామోదర్ కుటుంబానికి ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** డిసెంబర్ 5న జీడిమెట్లలో గుండెపోటుతో మృతి చెందిన సీనియర్ వీడియో జర్నలిస్ట్ దామోదర్ కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అండగా నిలిచింది. దామోదర్‌కు గుండెపోటు వచ్చిన సమయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌లు ఆసుపత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చి, భవిష్యత్తులో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ దామోదర్ కుటుంబాన్ని పరామ ర్శించి, తన వ్యక్తిగతంగా 5లక్షల రూపాయలు ఆర్థిక సహాయం ప్రకటించారు. దామోదర్ చనిపోయిన రోజున అంత్యక్రియల నిమిత్తం లక్ష రూపాయలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందజేశారు. కెటిఆర్ ఇచ్చిన మాట ప్రకారం శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కెటిఆర్ తరపున దామోదర్ ఇంటికి వెళ్లి వారి కుటుంబానికి 5లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించారు.

## ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో హెల్త్ క్యాంప్

**ప్రజాపక్షం/దౌల్తాబాద్:** నేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అమూల్య ప్రియదర్శిని తెలిపారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం మెగ హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు, వైద్యఅధికారి డాక్టర్ అమూల్య ప్రియదర్శిని తెలిపారు. ఈ క్యాంపులో స్రీవైద్యనిపుణులు ,ఎముకలవైద్యులు ,జనరల్ మెడిషిన్, చిన్నపిల్లల వైద్యులు, కంటి వైద్యులు వస్తున్నారని తెలిపారు. కళ్ళు, ముక్కు, చెవి, గొంతు, ఇతర సమస్యలపై ఉన్న వారు ఆధార్ కార్డు ఫోన్ నెంబర్ తీసుకుని క్యాంపుకు రావాలన్నారు.

## డంపింగ్ యార్డు పరిశీలించిన కలెక్టర్ దీపక్ తివారీ



**ప్రజాపక్షం/వికారాబాద్ :** ఉదయం వికారాబాద్ పట్టణ పరిధిలోని గంగారంలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యర్థాల వర్గీకరణ, పారిశుద్ధ్య చర్యలపై అధికారులతో మాట్లాడుతూ డంపిం గ్ యార్డులో చెత్తను సక్రమంగా వర్గీకరించి శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పర్యావరణానికి హాని కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేసి రీసైక్లింగ్ చర్యలు వేగవంతం చేయాలని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల్లో శుభ్రతను కచ్చితంగా పాటించాలని, దుర్వాసన, కాలుష్యాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పట్టణంలోని 28వ వార్డును సందర్శించి వార్డు సమస్యలపై ఆరా తీశారు. ప్రతి ఇంటికి వెహికల్ తిరిగి 100 శాతం తడి, పొడి, చెత్త సేకరణ జరగాలని, వెహికిల్‌లో జియో ట్యాగింగ్, సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలనీ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే విధంగా ప్రత్యేక చర్యలు:** శుక్రవారం రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయలంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన వివిధ శాఖల అధికారులకు 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి శ్రీధర్‌బాబు, శాసన మండలి ఛీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 6 హామీలను నెరవేర్చే దిశగా పని చేస్తామని జిల్లాలోని 4 నియోజకవర్గాలకు నోడల్ అధికారులతో సమన్వయం చేసుకోవడం జరుగుతుందన్నా రు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంగా పని చేస్తు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అయన అన్నారు. అనంతగిరి ఆకో పార్క్ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇండ్ల నిర్మణం, గ్రామ పంచాయతీ నీటి కొరత లేకుండా తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. జిల్లాలోని 106 గురుకుల పాఠశాలలో అన్ని మౌలిక సుదపాయాలు కల్పించేదుకు చర్యలు తీసుకుంటమన్నారు. జిల్లా మండల అధికారుల క్షేత్రస్థాయిలో పర్యటించి నాణ్యమైన భోజనాన్ని అందించేదిశగా పని చేస్తామని తెలిపారు.



## సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీజనను హైటెక్స్‌లోని ఆమె కార్యాలయంలో శుక్రవారం టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ స్థానిక నాయకులతో కలిశారు. ఈ నెల 8న కెపిహెచ్‌బి కాలనీ రోడ్ నెంబర్ ఒకటి హౌసింగ్ బోర్డ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ముఖ్య అతిథిగా విచ్చేయాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు ఆమెకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే స్థానిక సమస్యలను ప్రస్తావించి పరిష్కరించాల్సిందిగా కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు బండి రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్యం శ్రీరంగం, గాలి బాలాజీ, తూము వేణు, శేరి సతీష్‌రెడ్డి, సాదు ప్రతాప్ రెడ్డి, కొప్పిశెట్టి దినేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## పేదల కల నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయం

### మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహయాదవ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** పేదవారి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయమని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ అన్నారు. శుక్రవారం మూడుచింతలపల్లి మున్సిపాలిటి కేశవరంలో నిర్మితమైన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సింహయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేద కుటుంబాల సొంతింటి కలను నిజం చేస్తుందన్నారు. ఈ పథకం ద్వార ఇల్లు లేని ప్రతి ఒక్కరు లబ్ది పొందుతున్నారని చెప్పారు. డిసిసి అధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్ సహకారంతో మూడుచింతలపల్లి మున్సిపాలిటికి మరిన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మల్లేష్‌యాదవ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రామస్వామి, మున్సిపల్ మైనార్టి అధ్యక్షుడు మహ్మద్ యూసుఫ్, స్థానిక నాయకులు వెంకటేష్, ఈశ్వర్, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.



## మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/బంట్వారం :** బంట్వారం మండల కేంద్రంతో పాటు తోర్‌మామిడి, సల్‌బత్తాపూర్, రోంపల్లి గ్రామాలలో జిల్లా అధికారుల అదేశాల మేరకు నార్కోటిక్ డ్రగ్స్ డిఎస్‌పి భిక్షపతి రావు ఆధ్వర్యంలో మండల పరిధిలో ఉన్న అయా గ్రామాలలో డ్రగ్స్ నివారణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా నుండి ఆదర్శ పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా నార్కోటిక్ డ్రగ్స్ డిఎస్పీ భిక్షపతి రావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల పట్ల ప్రతి ఒక్కరు జగ్రత్తగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల, విద్యార్థులు ఎంతో జాగ్రత్త వహించాలన్నారు. డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలు ఎక్కడైన కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా డ్రగ్స్ అమ్మ డం కాని, రవాణా చేయ డం, నిలవచేయడం లాంటివి చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకునేందుకు కృషి చేయాలన్నారు. యువత మాదక ద్రవాలకు దూరంగా ఉండేలా చూడాలన్నారు. అదే విధంగా విద్యార్థులకు క్విజ్ కాంపిటేషన్ నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులకు వాలీబాల్, క్రికెట్ కిట్ తదితర ఆట వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో, స్థానిక ఎస్ఐ విమల, మహిళ పోలీస్టేషన్ వికారాబాద్ సిఐ. సరోజిని, ఎస్ఐ అనిత, శ్వేత, అబ్కారీ శాఖ ఎస్ఐ. రేఖ, ఎంపిడిఓ రాములు, ఎంఇఓ విక్రం రెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ బ్యూలా, ఎంపిఓ నాగరాజ్, మేడికల్ ఆఫీసర్ మజీద్ ఖాన్, అయా గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.



**వికారాబాద్ లో :** జిల్లా పోలీస్ యంత్రంగాం విస్తృత స్థాయిలో అవగాహనకార్యక్రమాలను నిర్వహించారు. ఎస్‌పి అదేశాలమేరకు వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డిఎస్‌పి, సిఐ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గోని సమన్వయంతో క్షేత్రస్థాయికివెళ్లి ప్రజలను చైతన్యనరిచారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలోని 4గ్రామాల చొప్పున ,జిల్లా వ్యాప్తంగా 80 గ్రామాలలో ఈ అవగాహన సదస్సులు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా డ్రగ్స్ మహమ్మారి వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ,యువత వ్యసనాలకు బానిసై భవిష్యత్తును ఎలా నాశనం చేసుకుంటున్నారో సోదాహరణంగా వివరించారు. పరిగి, కొడంగల్, వికారాబాద్, తాండూర్, నియోజకవర్గంలోని పోలీస్ స్టేషన్ల పరిధిలని అవగాహన కలిపించారు.

**డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం**

**పరిగిలో:** డ్రక్స్ రహిత సమాజమే లక్ష్యం కావాలని మాదారంలో భారీ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరైన ఈగల్ టీం డైరెక్టర్ సందీప్‌శాండిల్య, జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99' రోజుల కార్యక్రమంలో భాగంగా 5వ థీమ్ పిల్లల భద్రత డ్రగ్స్ కు అడ్డుకట్టపై పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాదారం గ్రామంలో ఈ రోజు భారీ అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్ అనే మహమ్మారి పట్ల యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎస్‌పి మాట్లాడుతూ డ్రగ్స్ అనేది కేవలం ఒక వ్యక్తిగత సమస్య కాదని ఇది ఒక ఆర్గనైజ్డ్ క్రైమ్ అని అభివర్ణించారు. ప్రతి పౌరుడు ఈ విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. చిన్నవయస్సులోనే తమకు ఎదురయ్యే అసౌకర్యాలను గుర్తించి, ధైర్యంగా తల్లిదండ్రలకు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టీం అదనపుఎస్‌పి కృష్ణమూర్తి, జిల్లా అదనపుఎస్‌పి రాములు, పరిగి డిఎస్‌పి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



